# NANA RAJANYA VIKHYATA JANA CHARITRA

**By**
**Sreeram Veerabrahma Kavi**
(Ex-Pandit, Noble College, Machilipatnam)

## నానా రాజన్య విఖ్యాత జన చరిత్ర

**గ్రంథకర్త**

**శ్రీరాం వీరబ్రహ్మ కవి**

**ఎక్స్-పండిట్, నోబుల్ కాలేజి**

**మచిలీపట్నం - 1932**

## పైడా వెంకన్న రామకృష్ణయ్య కుటుంబీకుల గురించి తెలిసిన వాస్తవాలు

**శ్రీరస్తు**

## విజ్ఞప్తి

"క్షితి నెవ్వనినామము సత్కృతి నెన్నిదినంబు లుండు ।
దివి నా పుణ్య వ్రతుఁడంత కాలముండును।
ధృతినింద్రద్యుమ్నునికి దృష్టాంతముగన్ **- అప్పకవీయము**

కేవల సంస్థానాధిపతుల చరిత్రలను మాత్రమె రచించి నానారాజన్య చరిత్ర మనుపేర 1918వ సం॥న నేను బ్రకటించి యున్న గ్రంథము పాఠక మహాశయుల పరిపూర్ణాదరమునకుఁ బాత్రమగుటచే మఱల నద్దానిని విపులీకరించుటయగాక, యందు వర్ణింపఁబడని యితర సంస్థానచరిత్రలను గూడ రచించి చేర్చి ద్వితీయ సంపుటముగఁ బ్రకటింపఁదలకొని యున్న యీ నా యుద్యమమును గమనించిన కొందఱు మిత్రులు సంస్థాన చరిత్రనే గాక శ్రీమంతులై, దేశోద్ధారకులై, యున్నతోద్యోగవిరాజితులై, రాజసన్మానితులై, యర్థిజనమందారులై, వంశదీపకులై విఖ్యాతిఁ గాంచిన వారి చరిత్రలను గూడ రచించి ప్రకటించుటుచితమని నుడువుటయ గాక, తదావశ్యమును గుఱించి స్థలాంతరమున ముద్రింపఁబడియున్న సదభిప్రాయంబుల నొసంగి నన్ను సోత్సాహుఁ గావించిరి.

వెండియు-'మహనీయుల జీవిచరిత్రముయొక్క మూలస్కంధమె ప్రపంచ చరిత్రమైయున్న' దను భావమును సూచించు సుప్రసిద్ధాంగ్లభాషా ప్రవీణుఁడగు 'కార్లైల్' పండితుని "The history of the world is at the bottom of the history of the Greate men" అను వాక్య మెంతయు సార్థకమైనదనుట నిస్సంశయము. మహనీయుల చరిత్రల నాదర్శముగ నుంచుకొని ప్రతివ్యక్తియుఁ దమ చరిత్రకు మెరుగిడజాలి యుండును. వెండియు నిబిడారణ్య మధ్యంబున దారి గానక నిరాశావివ శుండయి పరితపించు నొక పథికుండు తత్సమీప సైకతసలాంకితపాద చిహ్నంబుల గాంచి సంతసించి తదనుసరణగామియై చరించు చందంబునఁ బ్రతి మానవుఁడును మహాత్ముల పవిత్రాశయవిమలశీలాభివర్ణనాత్మక మగు భవ్యచరిత్రపాదచిహ్నంబులు దమ భావి సుఖజీవ యాత్రాభిగమనంబునకు మార్గ

దర్శకంబులై పరగ ధైర్యోత్సాహావలంబకుఁ డయి సంసారారణ్య వినిర్గగోపాయంబు నిరపాయంబుగఁ గాంచఁ గలుగుచుండును. ఈ భావమునే యాంగ్ల కవి శేఖరుఁడగు 'లాంగుఫెల్లో' ఇట్లు నుడివి యున్నాడు–

"Lives of great men all remind us
We can make out lives sublim"
And departing leave behind us
Foot prints on the sands of time.
Foot prints that perhaps another
Sailing over life's solemn main
A forlorn and shipwrecked brother
Seeing shall take heart again.
Let us then, be up and doing
With a heart for any fate
Still achieving, still pursuing
Lean to labour and to wait."

హైందవపండితాగ్రణియైన కవికర్ణ రసాయనకారుఁడును "అనఘకథా ముఖంబున హితాహితబోధ మొనర్తు రింపుగా" నని నుడువుటచే మహనీయ కథాకర్ణనంబున హితాహితబోధ మెఱుంగ నగునని తెలియుచున్నది. కావున నే నీ "నానారాజన్య విఖ్యాతజనచరిత్ర రచనకుం గడంగి ప్రథమ సంపుటముగ నిప్పటికీ గ్రంథమును బాఠక మహాశయులకు నివేదింపఁగలిగితిని.


ఇయ్యది యితరగ్రంథముల వలె నింట నుండి సునాయాసముగ రచింపఁ దగినది గాక, విషయపరిగ్రహణమునకై పలుతడవలు దేశాటన మొనరింప వలసి యుండెను. ఒకొకప్పుడేగిన స్థలమునకే నాలుగైదు తడవలేఁగ వలసివచ్చెను. ఇట్లగుటచే నమితవ్యయ ప్రయాసలకే గాక యధిక కాలహరణమునకును గారణ మయ్యెను. కావున మహారాజపోషక రాజపోషకేత్యాదివిధుల కనుమతించి ప్రపథమము నుండియు నా యుద్యమము నెడ సంపూర్ణ సానుభూతితో

నౌదార్యమును జూపుచున్న మహనీయులును దదితర విధముల దోడ్పడిన మిత్రులును జరిగిన కాలహరణమునకు మన్నించి మత్కృతజ్ఞతాభివందనము లందికొనఁ బ్రార్థితులు.

'ఇందు వర్ణింపఁబడని సంస్థానముల యొక్కయుఁ బ్రముఖుల యొక్కయుఁ జరిత్ర లనేకములు మిగిలియుండకపోలేదు. కాని యవ్వాని నెల్ల భగవదనుగ్రహము నను, భాషాభిమానుల సమధికౌదార్యమునను నచిరకాలముననే ద్వితీయ సంపుటముగ రచించి ప్రకటింపఁ బ్రయత్నింతు నని మనవి చేయుచున్నాను.

**- గ్రంథకర్త**

**(Added by Pydah Family Members)**
**Available from this Ancestor**



(18NA -1907)

**Pydah Venkanna** garu

Established Pydah Venkanna Ramakrishnayya Trust in 1884 for free boarding & lodging, for pilgrims at Draksharamam, Kotipalli & Bhadrachalam. 365 acres of fertile land and other assets donated to this trust make it self sufficient even today..

Constructed Ganapathi and Kalabhairava Alayams at Kakinada.

Renovated Vishnu and Shiva Alayams in Kakinada

**(Added by Pydah Family Members**
**Available from this Ancestor**



(1832 -1886)

**Pydah Ramakrishnayya** garu

Contributed Rs 1,00,000/- in 1881 for the renovation of Lord Bheemeshwara temple at Draksharamam – one of the Pancharamas.

Ramakrishnayya garu financed a choultry for Vedic learning at Kashi (Varanasi) in the name of his wife, Smt. Venkamma

In association with Sri Kandukuri Veereshalingam Pantulu they encouraged and financed widow re-marriages

## శ్రీరస్తు

## అన్నదేవరపేట ఎస్టేటు

(పైడా జమీందారులు)

కాకినాడ.

**సీ॥** ప్రవిమలకీర్తి మై శివకేశవులక దే
వళములఁ బెక్కింటి నిలిపి రెవరు
కరుణార్ద్రచిత్తులై నిరతాన్నదానస
త్రము లనేకములుంచి తనరి రెవరు
సప్తసంతానాది సత్క్రియాళికి వేన
వేలు వెచ్చింపఁగఁ జాలి రెవరు
ప్రతివత్సరము గణపతినవరాత్ర్యుత్స
వములను సలుపు సద్భక్తు లెవరు

**తే.గీ॥** సకలకోవిద స్తవనీయచరితు లెవ్వ
రట్టి పైడాన్వవాయదుగ్ధాబ్ధి చంద్రు
లాయురారోగ్యభోగభాగ్యములు గలిగి
యలరుదురు గాత మాశశాంకార్క మవని.

ఆగర్భ శ్రీమంతులై యనేక వాపీకూపతటాకాలయసత్రశాలాది ధర్మప్రతిష్ఠాపనాస్థాపకులయి, దీనమందారువై, స్థిరయశశ్శ్రీగాంచువారు వైశ్యకులంబునఁ బెక్కంద్రు గలరు మఱియు నీ కులము వారు వ్యాపారరహస్యాభిజ్ఞులై వాడవాడల యందలి యోడవ్యాపారమునను దదితర వర్తక విశేషమునను ద్రవ్యార్జకుంగల మూలసాధనం బెఱింగి తన్మూలమున లక్షలకొలఁది ద్రవ్య మార్జించి భగవదనుగ్రహాయత్తమైన యా విత్తమును దేశహితార్థమై వినియోగించు నుదార చిత్తులును గలరు. 'సప్తసంతానములలోఁ బ్రశస్తి గాంచి ఖిలము గాకుండునది ధాత్రి కృతి, యని యెఱింగి కృతిపతులుగ నుండువారు గలరు. పూర్వకాలమున శ్రీనాథకవి కృతహరవిలాసమును గృతినందిన సిరియాల తిప్పయ్య యను వణిగ్వరుఁడు తన నామమును నా చంద్రార్కస్థాయిగ వెలయించెను. ఇక్కాలము నందును బండితగోష్ఠిచే–"తరుతటాకాది సంతతుల్ ధరణి నెచట నిలిపి రచటనె యుండు వానికిని గృతి ముఖంబుననె విశ్వవిఖ్యాతిగాంచు కృతియె సంతతివతంప"మని తెలిసికొనిన కొందఱు కృతుల నాదరించుచున్నారు. అట్టివారిలో శ్రీకృష్ణభారత కృతిపతియై పాలకొల్లు గ్రామ వాస్తవ్యులును, రేపాక వంశజలధిచంద్రులునునైన సత్యనారాయణమూర్తిగారనఁబడు నిష్కళంక కీర్తిధనుండును జనోపయోగార్థమై వేనవేలు వెచ్చించి సకలధర్మక్రియా పరతంత్రులై ప్రభావతీపరిణయకృతిపతులైన రావుబహదరు పైడా వేంకటాచలపతిగారును మఱికొందఱును వినిర్మల కీర్తి చంద్రికల వెలయించుచున్నారు.

ఈ పైడావారి గృహనామము గ్రామనామముగఁ గాక వీరు పట్టినది యెల్ల పైడియా యనునట్లు వ్యాపారమునఁ గలసివచ్చుటచే పైడావారను సార్థక నామమె గృహనామముగఁ గలిగినట్లు చెప్పుదురు. అట్టి పైడావారిలో సర్వయ్య యనువారు గోదావరీ మండలములోని పిఠాపురమున నివసింపుచు వ్యాపారాదుల వలన నప్పటికే విశేష ధనవంతులను ఖ్యాతిగాంచి యుదారణ గుణంబునఁ బలువుర ప్రశంసకుంభాత్రులై వెలసిరి. వీరికి వెంకటలక్ష్మమ్మ యను నర్ధాంగి వలన జనించిన వీరన్నగారు దమ నివాసమును వర్తకస్థానమైన కాకినాడకు మార్చి తమ వ్యాపారమును నత్యంతాభివృద్ధికిఁ దెచ్చిరి. వీరు రమణమ్మ యను

సాధ్వీమణిని బరిణయమై యాపెవలన రామన్న వెంకన్నగార్లను సుతద్వయమును గాంచిరి. యీ యిరువురియందు రామన్నగా రేవురు పుత్రులను, వెంకన్నగారు నల్వురు పుత్రులను గాంచిరి, వీరు పెదవీరన్న పెదచలమయ్య చినవీరన్న చిన చలమయ్య యనుపేర్ల విలసిల్లిరి. వీరిలో చిన చలమయ్యగారు వంశవర్ధనులై వ్యాపారదక్షులై, ధర్మక్రియాపరతంత్రులై కాకినాడయందె యుండి ధర్మపత్నియైన వెంకమ్మగారివలన నిరువురు పుత్రులంగాంచిరి. ప్రభావతీ పరిణయమున నీ వెంకమ్మగారిట్లభివర్ణింపబడిరి.

సీ॥ బిచ్చ మెత్తుచు నున్న ప్రియుని వారింపని
యన్నపూర్ణ య దెంత యాభిజాత్య
దుంపదూఁడులు మెక్కుదొరను వారింపని
వసుమతి దా నెంత వరగుణాఢ్య
ధరణి దానముబట్టుధవుని మాన్పింపని
శ్రీకాంత దానెంత స్థిర గణింప
పతితుల వాకిలిఁ బాయక యుండిన
వాణిమితోక్తి సౌభాగ్య మెంత

గీ॥ యనుచు శర్వాణి కళ్యాణి యబ్జపాణి
కమలజనిరాణి మించి యా కమలనయన
పతికిఁ బూర్ణతాపంక తాభవ్యమతులు
వెలయఁగను జేయు గుణలంబ వేంకమాంబ।

ఈ వెంకమాంబాచలమయ్య గార్లకు వెంకన్న రామకృష్ణయ్య గార్లుదయించిరి. ఇందగ్రజులైన వెంకన్నగారు మంగమ్మగారి వలన చలమయ్య జగన్నాథము నారాయణమూర్తిగార్లను సుతత్రయమును గాంచి యనేక దేవాయతన సత్రగోపు రాదుల నెలకొల్పి విశేషఖ్యాతి గాంచిరి. వీరిలో చలమయ్యగారికి సుబ్బారావు గారును జగన్నాథముగారికి వెంకటరమణమూర్తిగారును జననమందిరి. ఈ వేంకటరమణమూర్తిగా రాంగ్లభాషాభ్యాస మొనరించి బి.ఏ. చదువుచు నాగర్భ శ్రీమంతులును నాధునికాచార ప్రియులునునై ఖండాంతర మగు పాశ్చాత్య

దేశమున కరగి ఎడింబరోలో వైద్యశాస్త్ర మభ్యసించి యం.బి.సి.యం. (M.B.C.M.) పరీక్షయందు తీర్ణులై జర్మనీ మహాయుద్ధ సందర్భమున క్షతగాత్రులైన సైనికుల కపార సేవ గావించి పిమ్మట స్వదేశమునకు వచ్చి స్వయముగా వైద్యమొనరించు చున్నారు. వీరు కొంతకాలము పురపాలక సంఘ సభ్యులుగఁ గూడ నుండిరి.

రామకృష్ణయ్యగారు మండలాధికారులతోను దక్కుంగల యున్నతోద్యోగులతోను విశేష పరిచయము గలవారయి ప్రతిప్రజాహితోద్యమమునందును బాల్గొనుచుఁ బేరు గాంచిరి. వీరు ధనాఢ్యులును నుదారవంతులును నగుటచే నాంగ్లేయోద్యోగుల యొక్కయుఁ దదితర ప్రముఖులయొక్కయుఁ గోర్కి ననుసరించి యొక గొప్ప విలాసగృహము (క్లబ్బు) ను నెలకొల్పిరి. ఇందు ఖేలనోపయోగకరము లయిన సమస్త పరికరములును, విశాలావరణమును సుందరోద్యానమును, నాంగ్ల జనాచారానుసారముగ స్నానార్థమై నిర్మింపఁబడిన యొక వసతియుఁగలిగి మిగుల మనోహరముగ నుండును. ఈనిర్మాణ మొనరించి యాంగ్ల ప్రముఖుల మన్ననలకుఁ బాత్రులయిరి.

శ్రీ రామకృష్ణయ్యగారు సంఘసంస్కార ప్రియులును ననాథజనరక్షా పరతంత్రులును నయి కీ॥శే॥ వీరేశలింగము పంతులుగారి స్త్రీ పునర్వివా హోద్యమము నెడ సానుభూతిని గలిగి, తత్సాహాయ్యార్థమై నలువదివేల రూప్యముల (40,000) విరాళమొసంగి యనాథలయిన దీనురాండ్ర కెందఱకో పతిభిక్షఁ బెట్టిరి. ఉత్తమకుల సంజాతులును, నాగర్భశ్రీమంతులును నయిన యిట్టి వైశ్య ప్రముఖుల సానుభూతిగించిన యుద్యమ మెంతయు నభివృద్ధి గాంచవలసినదే కాని పూర్వాచార పిశాచావేశులయిన దేశీయ సోదరుల కొందఱి మూర్ఖపుఁ బట్టుదలవలనను, దేశదురదృష్టము వలనను నీ యుద్యమ మింకను నిరాఘాటముగ సాఁగుట లేదు. అయినను శ్రీయుత మోతే నారాయణరావు జమిాందారుగారు, న్యాయమూర్తులైన శ్రీయుత ముత్తా వేంకట సుబ్బారావు గారు, మండలాధికారులు (జిల్లా కలెక్టరు)గ నున్నట్టి భగవంతం గుప్త గారు మున్నగు ప్రముఖుల వలన మఱల నీయుద్య మాంకురము దోహదము గాంచి నవన నోన్మేషణ మందఁ గలుగుచున్నందులకు నానంద మగుచున్నది.

శ్రీ పీఠికాపుర సంస్థానాధీశ్వరులును విద్వత్ప్రభువులును దానకర్ణులును నైన ప్రస్తుత మహారాజాగారి జనకులగు కీ॥శే॥ శ్రీ వెంకట మహీపతి గంగాధర రామారావు బహదరు గారు ప్రీతిపురస్సముగ మన పైడా రామకృష్ణయ్యగారి కొవ్వూరుగ్రామ మొసగినట్లే క్రింది పద్యము సెప్పుచున్నది-

శా॥ ఆ గంగాధరరామరాయనృపపంచాస్యుండు కోదండవి
ద్యాగంగాత్మజతుల్యవిక్రముఁడు మోదం బాఱ సౌహార్దత-
భోగార్థంబుగ రామకృష్ణునకుఁగొవ్వూర్గ్రామము న్గాన్కగాఁ
బ్రాగల్భ్యంబున నీయఁగై కొనియె సౌభాగ్యంబు శోభిల్లఁగా-

శ్రీరామకృష్ణయ్యగారును వీరి యగ్రజులయిన వెంకన్నగారును గలసి దాక్షారామ పుణ్యక్షేత్రమున సమధికవ్యయముతో నొక గొప్ప సత్రమును నిర్మాణ మొనరించిరి. ఈ సత్రమున సంస్కృతవిద్యార్థులకుచిత భోజనవసతి గల్పింపఁబడెను మఱియు కోటిఫలి పుణ్యతీర్థము సేవింప నరుదెంచు యాత్రికులకును దదితర మార్గస్థుల కును సంఖ్యా పరిమితి లేక యెందఱు వచ్చినను నిరతాన్నదానము సేయు నేర్పాట్లు గావింపఁబడెను. వేసంగిని బాటసారుల దాహశాంతికయి చలివేంద్రం పెట్టుదురు. ఇందు మజ్జిగగూడ నొసఁగబడును. ఈసత్రపోషణార్థమై నలువదివేల (40,000) రూప్యముల మూలధనమెగాక యాప్రాంతమందలి మంచి సారవంతములయిన కొన్ని భూములుగలవు. భూములకు ధరలుగల యిక్కాలమున నాసత్రమునకు సమస్తమును గలిపి రమారమి యొక లక్ష రూప్యముల మూలధనము గలదనవచ్చును.

ప్రాచీనకాలమున నిర్మింపబడి మహెూన్నతమయి చూచువారల కద్భుతాశ్చ ర్యంబులు గొలుపుచున్న దాక్షారామ భీమేశ్వరాలయమున నొక గొప్ప గోపురమును ధ్వజస్తంభమును నెలకొల్పిరి. విశేషాన్నదానముతోను మహెూత్సవముతోను నీ ప్రతిష్ఠాపనలను జరిగించిరి.

శా॥ సాక్షాదీశ మహోత్సవంబు గనఁగా నంప్రీతి రండో సహ
స్రాక్షాగారనలాక్షులార! యనుచు న్సానందయై పిల్వఁగాఁ

దా క్షోణీపతి మీఁది కెత్తి న భుజాస్తంభంబులో నాధర్మ
దాక్షారామ ముఖాలయంబుల ధ్వజాస్తంభంబు లొప్పారెడుర్

రామలింగేశ్వరాగ్రహార వాస్తవ్యులు పానీయోదకమునకై మిక్కిలి బాధ పడుటను గాంచి యందు దమపేర నొక గొప్పతటాకమును ద్రవ్వించి యందలి జనుల కృతజ్ఞతకు బాత్రులయిరి. ఉపనయనముల కని వివావాముల కని వచ్చి యాచించు వారలకును దత్త దుచిత సాహాయ్య మొనరించు చుండెడివారు.

దైవభక్తియందును నిరుపమానులయి విశేష ధనవ్యయముతో ననేక దేవాలయములను గట్టించిరి. కాకినాడలోని భైరవాలయమును, విష్ణ్వాలయమును, శివాలయమును, గణపతి దేవాలయమును వీరే గట్టించిరి. భాషాభిమానులయి శ్రీ పిఠాపుర మహారాజాగారి కాలేజియందుఁ దమపేర నొక భవనమును వెలయింపఁ జేసి యెనిమిదివేల రూప్యము లొసంగిరి. హూణ విద్యార్థుల గాన విద్యా పోషణార్థమై సహస్ర రూప్యముల నిచ్చిరి. మఱియు నేటివ్ క్లబ్బు నిర్మాణ మునకును నాలుగువేల రూప్యముల నొసంగిరి. దైవభక్తియు విద్యాసక్తియునే గాక రాజభక్తియుఁ గలిగి స్వర్గీయులైన ఎడ్వర్డు చక్రవర్తిగారు యువరాజుగా నున్న తరుణమున వారిపేర రాజభక్తిసూచనార్థమైయొక గొప్ప సత్రమును గట్టించిరి. సత్రమైనను నిదియొక కేళీభవనమువలె సరస్సు, ఫలవృక్ష పుష్పలతా సమన్విత సుందరోద్యానము కందుక క్రీడాస్థలము (Tennis Court) గలిగి యందముగా నుండును. ఈసత్రమున గ్రుడ్డి కుంటి మున్నగు వికలాంగులకు భోజనమును బాటసారులకు వలయు పాత్రసామాగ్రియు నొసంగుదురు. ఇందుఁ గార్తిక మాసమున గొప్ప సంతర్పణము జరుగును. రాజకీయోన్నతోద్యోగులు, రాజబంధువులు, తదితర ప్రముఖులు కార్యార్థులై వచ్చినప్పుడిందే విడియుదురు.

వీరి యర్థాంగలక్ష్మి యైన వెంకమ్మగారు దన యర్థాంగ నామ మన్వర్థము జేసికొనుటకోయనఁ దన భర్తగారివలెనే యీపెయుఁ బెక్కు దానము లాచరించు చుండెడిది. కాశీయాత్ర యొనరించినప్పుడందుఁ బగలు భోజనము పెట్టు సత్రములే గాన రాత్రి భోజనములిడు సత్రములు గనఁబడ కుండుటచే నీ సాధ్వీమణి యిరువది వేల (20,000) రూప్యము లొసఁగి యీ మహాక్షేత్రమున

నొక సత్రమును నెలకొల్పెను. ఈ సత్రపోషణార్థమై మఱియొక గొప్ప భవనమును గొని తదర్పణ మొనరించెను. తనజీవితాంతమున 'ద్వాదశీధర్మము' లకై రెండువేల రూప్యముల మూలధన మేర్పఱచెను. ఒక చలివేంద్రం జరిగించుటకును నొక వేయిరూప్యములొసంగి పుణ్యశీల నా విఖ్యాతి గాంచెను.

శ్రీ పైడా రామకృష్ణయ్యగారి ధర్మముల గుఱించి సంగ్రహమున నీ క్రింది పద్యమునఁ దెలుపఁబడియె.

**సీ॥** ఏ సూరి సరసాళి యిం పొంద బంతుల
సాలకు నాలుగు వే లొసంగె
నే నేత బాలుర కింగ్లీషు బోధించు
కాలేజి కెన్మిది వే లొసంగె
నే దాత ద్విజవరు లెన్నంగ నన్నస
త్రాళికి నిర్వదివే లొసంగె
నే మేటి ముదముతో నిల ననాథావివా
హాళికి నల్వది వే లొసంగె

**గీ॥** నట్టి సుజనైకలోక విఖ్యాతయశుఁడు
ధైర్య గాంభీర్య షడ్గుణైశ్వర్య యుతుఁడు
సాధుసజ్జన పోషణాంచన్మనస్కు
డర్యమాత్రుండె రామకృష్ణార్యవరుఁడు.

ఈ పుణ్యదంపతులకు సుబ్బారాయుఁడుగారు, వేంకటాచలపతిగారు, చలమయ్యగారు నను మూవురు పుత్రులుదయించిరి. ఈ సోదరులు మూవురును గావించిన ప్రజోపకార కృత్యములనేకములు గలవు. వీరి తండ్రిగారయిన రామకృష్ణయ్యగారు కొవ్వూరు గ్రామమును గడించిన విధమును పైనఁజదివియే యున్నారుగదా! ఇప్పటి పశ్చిమగోదావరీ మండలమునకుఁ జెందిన అన్న దేవరపేట, ప్రక్కిలంక యెస్టేటు లప్పటి మద్రాసు గవర్నరుగారైన లార్డు కార్నవాలీసు (Lord Cornwails) దొరగారివలన రెడ్డి నృసింహదేవుగారికి శాశ్వతకర నిర్ణయ

మొనరించి (Permanent Settlement) యొసఁగఁబడెను. వాని నుండి శ్రీ పిఠాపురము మహారాజాగారు క్రయమునఁ దీసికొనిరి. అటుపిమ్మట నీ యెస్టేటు శ్రీ రాజా యినుగంటి పాపయ్యగారికి మఱి కొందఱకు సంక్రమించెను. కాని మరి కొంతకాలమున కీ యెస్టేట్లను శ్రీ పైడావారు కోర్టు ద్వారా విక్రయమున సంపాదించిరి.

1. అన్నదేవరపేట యెస్టేటు–అన్న దేవరపేట, చిట్యాల, లేళ్ల, చింతలగూడెము, పెద్దాపురము, రావూరుపాడు, తాళ్లపూడి, వీరభద్రపురము అగ్రహారములు గలిసి యున్నది. ఇందలి భూములు సారవంతములై జిరాయితి హక్కు గలిగి రూ. 14,000/– ల పేష్కష్ చెల్లుచు లక్షరూప్యముల వఱకు రాబడి గలదియై యున్నది. ఇందుఁగల దేవాలయములకు నేటేట నీ జమిందారులు మంచి వేడుకతో నుత్సవములను గావింపు చుందురు.

2. ప్రక్కిలంక–గోదావరీలంకలతోఁ జేరినదై యిందు నాడెమైన పొగాకు పండుచున్నది. దీనిని రంగూన్ వర్తకులు గొని సీమకెగుమతి సేయుదురు.

3. అరెంపూడి ముఠా–కోడూరు, కొంతంగి, వేంకటేశ్వరుల వారిపేట, పారుపాక, సీతయమ్మపేట అను మొఖాసాగ్రామములు గలిగి శ్రీ బొబ్బిలి మహారాజాగారికిని వీరికిని గలిసి యున్నది.

4. జగన్నాథపురము–ముఖాసా గ్రామమును, కోట లక్ష్మన్న నాయుఁడు గారికిని వీరికిని జెందినదియునై మెట్టపల్లముల పంటలు పండు సారవంతమైన భూములు గలదియై యున్నది.

5. కోటపాడు–శివారు రామేశంపేట–ఇందు విశేషముగ బశువుల బీళ్ళు గలవు.

6. విశాఖపట్టణము జిల్లా గోలుకొండ తాలూకాలోని పెద్దిపాలెం యెస్టేటు ఏటియాధారమువలన సమస్త పంటలును బండునదియై దొరతనము వారికి రమారమి రెండువేల రూప్యముల వఱకు పేష్కష్ వగైరాలు చెల్లుచుండును.

7. ఇందే కైలాసపట్నం అగ్రహార మొండు గలదు. ఇందు సారవంతము లైన భూములు గలిగి చెఱకుపంట విశేషముగఁ బండుచుండును.

**(Added by Pydah Family Members)**



(1865 -1932)

**Rao Bahadur**


## Pydah Venkata Chalapathi garu

Donated land for the Town Hall, the First Library "Literary Association", and the Ladies Recreation Club

Also donated land for Kakinada Water works - the Reservoir, and the Koneru for Ramalingeshwara Agrahram (presently near Bala Tripura Sundari Temple).

Built a Vedic School at Kakinada with free meals for the students. Built the Science block at P.R.College. Donated land for the Municipal Girls High School at Kakinada. Setup an Ayurveda Hospital providing free treatment. Founded a Choultry for the Physically Challenged

**(Added by Pydah Family Members)**



(1868 - 1940)

**Pydah Chalamayya** garu

Established Pyndah Chalamayya Choultry providing free boarding and lodging for poor students, and free food for the poor including poor travelleres.

అంటు మామిడితోటఁ లిందు విశేషముగాఁ గలవు. అచ్చటచ్చట నడవులు కొండలు గలిగి మృగయాపరుల కనుకూలముగ నుండును.

వీరు నిజావాసమైన కాకినాడయం దసామాన్య వ్యాపారాభివృద్ధి గావించి "వాణిజ్యే వసతి ర్లక్ష్మీ" అను వాక్యము సార్థకముగాఁగ లక్షలకొలఁది ద్రవ్య మార్జించి ధనవంతులనియేగాక దానకర్ణులనియు ఖ్యాతి గాంచిరి. వీరిలో రావ్ బహదరు పైడా వేంకటాచలపతిగారు 1865 సెప్టెంబరు 28వ తేదీన జనన మందిరి. వీరు కాకినాడయందే కొంతవఱకు హూణాంధ్ర భాషల నభ్యసించి పిదపఁ దండ్రిగారి వర్తకమునఁ బాల్గొని వ్యవహారజ్ఞులై వారి యనంతరమున వర్తకము నభివృద్ధిపఱచి పురప్రముఖాగ్రేసరులై వాసీ గాంచిరి. వీరు శ్రీమంతులయ్యును గేవలభోగతత్పరులై యుండక ప్రజాసేవాధురంధరులై పోర్టుకన్సర్వెన్సీ సభలోను, పురపాలకసంఘము, తాలూకాబోర్డు, జిల్లాబోర్డు మున్నగు స్థానిక పరిపాలనా సంస్థలలోను జిరకాలము సభ్యులుగనుండి ప్రజల యిక్కట్టులను గమనింపుచుఁ దన్నివారణార్థముగఁ బెక్కు మహోపకారములను గావించి యున్నారు. అట్టి వీరి ధర్మకార్యములలో నీక్రిందివి కొన్ని:- కాకినాడ పట్టణమున నత్యంత విశాలమును సౌందర్యమును గలిగి ముప్పదివేల రూప్యముల (30,000) వ్యయముతో 'వేంకటాచలపతి పురభవన' మను పేర వెలసిన పురభవనము. (Town Hall.) ఇందత్యంత రమణీయమైన నాటకరంగమును శ్రీ స్వర్గీయ పోలవరాధిపునిచే నొసఁగఁబడిన పుస్తక భాండాగారమును, భాషా సంఘమను "లిటరరీ అసోసియేషన్" వారిక్లబ్బును గలవు. గొప్ప గొప్ప యుపన్యాస సమావేశము లిందే జరుగుచుండును.

కాకినాడ పట్టణమున మంచినీటి యిబ్బంది తొలగుటకై వీరు ప్రత్యేకముగఁ బురజనోపయోగార్థమై ప్రతివీధికిని కుళాయి నేర్పఱచునటులఁ బురపాలకులతోను దొరతనమువారితోను సంప్రదించి రూ. 42,500ల విరాళ మొసంగి పౌరుల కృతజ్ఞతకుం బాత్రులైరి. మఱియు నీ కుటుంబము వారు--

శ్రీ వేణుగోపాలస్వామివారి శాశ్వత బాలభోగమునకై యిచ్చిన విరాళము రూ. 2,000.00

శ్రీ పైడా చలమయ్యగారి పేరిట కొన్ని వేల రూప్యముల వ్యయముతో నొకసత్రమును నెలకొల్పి దాని మూలధనమునకై యిచ్చినది రూ. 50,000.00

మఱియు నిందులకై కొనఁబడిన యింటి కొఱ కిచ్చినది, రూ. 3,000.00

వేంకటాచలపతిగారి ధర్మపత్ని యైన సత్తిరాజమ్మగారి పేరిటఁగూడ నొక సత్రమును విశేషధనవ్యయముతో నిర్మించి దాని మూలఁధనమునకైయిచ్చినది, రూ. 40,000.00

శ్రీ వేంకటాచలపతిగారు దమషష్ఠిపూర్తి మహోత్సవ సమయమున రౌప్యములతోఁ దులాభారముదూఁగి తూగిన యాఱువేల రూప్యములను బ్రాహ్మణుల కును, బేదసాదలకును ధర్మ మొసంగినది. రూ, 6,000.00

మఱియు శ్రీజగన్నాథస్వామివారి నిత్యభోగమునకును, శ్రీపిఠాపుర కుక్కుటేశ్వర స్వామివారి నిత్యనైవేద్యముల కొఱకును దగు ధనమొసంగిరి. కాకినాడలోని శ్రీ పిఠాపురము మహారాజాగారి కళాశాలలోని ప్రాగ్భాగ నిర్మాణమునకు రూ. 3,000ల విరాళమొసంగిరి. మఱియునందలి విద్యార్థుల సంగీతము కొఱకేర్పడిన సంగీతనిధికై రూ. 1,000ల విరాళమొసంగి లలితకళకుఁ బ్రోత్సాహ మొసంగిరి. వీరికిగల భూతదయచే జంతుహింసా నివారక సంఘమునకును జాలద్రవ్య సాహాయ్య మొనరించిరి. రాజభక్తి సూచింప జర్మనీయుద్ధ సందర్భమున బెక్కువేల రూప్యముల యుద్ధఋణపత్రము (War Loan Bonds) లను దాము గొనుటయ గాక, పెక్కండ్రచేఁ గొనిపించి దొరతనము వారి మెప్పును గాంచిరి. స్త్రీ విద్యాభివృద్ధికిని వారి యారోగ్యాభివృద్ధికిని ననువగు వ్యాయామ మొనరించు టకును నుపయోగపడునటుల సమస్త పరికరములతో 6,000 రూప్యముల వ్యయముతో నొక విలాసగృహము (Laides Recreation Club) నేర్పరచి, స్త్రీ స్వాతంత్రోద్యమము పట్లఁ దమకుఁగల నభిమానమును వెల్లడించిరి. ఆయుర్వేదౌ షధాభిమానమును గలవారయి 10,000 రూప్యముల వినియోగించి యొక యుచితౌషధాయలయమును స్థాపించి యందు సమర్థులైన వైద్యుల నియోగించి

ప్రతివారికిఁ దగు నౌషధసేవ లభింపఁ జేయుచున్నారు. కాకినాడ, ద్రాక్షారామము లందలియుఁ గాశికాక్షేత్రము నందలియు సత్రశాల లవిచ్ఛిన్నముగా జరుగునట్లు చూచుచు, వేదశాస్త్రాది విద్యల నభ్యసించు విద్యార్థులకును, దైర్ధికావళికిని నిరంత రాన్నదానము జరిగించుచున్నారు.

వీరలయొక్కయు, శ్రీయుత లింగమల్లు రామచంద్రరావుగారి యొక్కయుఁ బ్రోత్సాహముచే గుంటూరునందు స్థాపింపబడిన గోగునార ప్రత్తియంత్రము (Jute & Cotton Mill) వలన వందల కొలది కూలిజనమునకు జీవనాధారము గలిగెను. ఇందులకై విశేషధనము పెట్టుబడి పెట్టఁబడెను. ఈ యంత్రాలయము సమర్థులగు వారిచే నడపఁబడునెడ లాభకారిగ నుండఁగలదు.

శ్రీయుత వేంకటాచలపతిగారు ఓరుగంటి సోముసుందరక వికృత ప్రభావతీ పరిణయ ప్రబంధమును గృతిఁ గొనువేళ మహావైభవముతో గొప్ప సభఁగావించి గ్రంథ మాలించి కృతికర్త కేనూటపదార్లతోను జాంబూన దాంబరములతోను సత్కరించిరి. మఱియుఁ బెక్కంద్ర కనేక ధర్మములు చేసి యీ క్రింది రీతి కీర్తి గాంచిరి–

సీ॥ బుధగురుఁ దనఁదగు బులుసు ప్రకాశ వే
దార్థికి నూటపదార్ల నొసఁగెఁ
బుల్లె శ్రీదక్షిణా మూర్త్యాది సత్పండి
తాళికి నూటపదార్ల నొసఁగె
నల పరవస్తు రంగాచార్య విజ్ఞాన
సూరికి నూటపదార్ల నొసఁగె
శతఘంట కవితావిశారదశారదా
దరులకు నూటపదార్ల నొసఁగె

గీ॥ వేదవేదాంగ పాఠకవేత్త లైన
పండితాళికిఁ గుండలప్రకరమొసఁగె
సరసహృదయుండు వేంకటాచలపతీంద్రుఁ
డతని యౌదార్య మెన్నంగ నలవి యగునె.”

**(పైడావారు చేయించిన తాత్పర్య వివరణ)**

1. గొప్ప గురువు, వేదములు తెలిసిన 'బులుసు ప్రకాశరావు' గారికి నూట పదహార్లు (116) ఇచ్చారు.

మంచి పండితోత్తములయిన 'బుల్లె శ్రీదక్షిణామూర్తి' గారికి నూటపదహార్లు (116) ఇచ్చారు,

విజ్ఞాన ఘనులయిన 'పరవస్తు రంగాచార్యు'లకు '116' ఇచ్చిరి.

కవితా విశారదులు, శతఘంట (100 కలములు) విశారదులకు వేద వేదాంగములను చదివిన అనేకమంది పండితులకు నూటపదహార్లు, కుండల ప్రకరములను ఇచ్చిరి.

సరస హృదయులయిన వేంకటాచలపతిగారి ఔదార్యమును (ఉదార హృదయమును) మాటలతో తెలుపసాధ్యము కాదు.

సీ॥ శ్రీ జగద్గురువర శ్రీపాదపద్మముల్
శతసువర్ణ సుమపూజలను సలిపె
అపరపతంజలి యౌ భాగవతి హరి
శాస్త్రికి నూఱు నిష్కముల నొసఁగె
వ్యాకరాణాచార్యవర్య సుబ్రహ్మణ్య
శాస్త్రికి నూఱు నిష్కముల నిడియె
సర్వతంత్రార్త విశారద శ్రీరామ
శాస్త్రికి నూఱు నిష్కముల నిచ్చెఁ

గీ॥ బూజ్యమతి హనుమచ్ఛాస్త్రి మొదలుగాఁగఁ
బండితవరేణ్యులకు శతప్రతతు లొగఁగె
నౌర పైడాన్వయుని వేంకటాచలపతి
వైశ్యభోజుఁ డటంచుఁ జెప్పంగవలదె.

**(పైడావారు చేయించిన తాత్పర్య వివరణ)**

2. శ్రీ జగద్గురువరులకు వంద బంగారు పువ్వులతో పాదపూజ చేసారు.

అపర పతంజలిగా ప్రసిద్ధి చెందిన 'భాగవతి హరిశాస్త్రి' కి వంద నిష్కములు ఇచ్చిరి. (నిష్కములు అంటే బంగారు నాణెములు) వ్యాకరణ ఆచార్యులయిన శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి వంద నిష్కములు ఇచ్చిరి.

సర్వతంత్ర అర్థ విశారదులు, శ్రీరామశాస్త్రి గారికి వంద నిష్కములు ఇచ్చిరి.

గొప్ప హృదయముతో హనుమత్‌శాస్త్రికి, మొదలుగా గల పండితులెందరికో శతప్రతములు ఇచ్చిరి.

పైడా వేంకటాచలపతి గారిని 'వైశ్య భోజు' నిగా చెప్పతగును.

(భోజ మహారాజు పండితులను ఆదరించుట, దానధర్మములు చేయుటకు ప్రసిద్ధి చెందిన రాజు)

ఇంతియేగాక యాశ్రిత జనాపనులును, బ్రాహ్మణ భక్తి గల వారును నై ఆకెళ్ల శాస్త్రిగారి కొక మేడయును మఱికొందఱకుఁ గొన్ని గృహదానములను గావించి యున్నారు. లోకమున లక్షాధికారు లనేకులు గలరు గాని వీరివలె నిట్టి త్యాగ శీలము గలవారు మిక్కిలి యరుదు. యాత్రలకని యజ్ఞములకని యెప్పుడును నెవరో యొకరు వచ్చి యాచించుచునే యుందురు. అట్టివారలకెల్లఁ దత్త దుచితముగ నొసఁగుటయగాని నాస్తియని చెప్పుటెన్నడును లేదు. ఈపైడా కుటుంబమువారిచే నైదు పత్రములు స్థాపింపఁబడి నిరతాన్నదాన మొనరింపఁ బడుచున్నది. ఇట్లే కుటుంబము వారును జరిగించి యుండలేదనవచ్చును.

శ్రీవేంకటాచలపతిగారి దేశసేవకును, రాజభక్తికిని, బరోపకార పారీణతకును మెచ్చి దొరతనము వారు 1906లో రావుసాహెబు బిరుదమును 1915 వ సం॥న రావుబహదరు బిరుదము నొసంగి గౌరవించిరి. వీరు 1916వ సం॥లో నెల్లూరులో జరిగిన 9వ ఆర్యవైశ్య మహా జనసభ కధ్యక్షులుగ నుండి యీ సభను జయప్రదముగ నిర్వర్తించుటయగాక వైశ్యవిద్యార్థుల విద్యాభివృద్ధికై 1,116

రూప్యములు సమర్పించిరి. 38వ దేశీయమహాజనసభ కాకినాడలో జరిగినప్పుడు వీరెక్కుడు ధనసహాయము సేయుటగాక యాహ్వానసంఘమున (Reception Committee) కుపాధ్యక్షులుగ నుండి యపారసేవ గాంచియున్నారు. వీరనేక దేవాలయముల ధర్మకర్తలు (Trustee) గcగూడ నుండి చక్కగ స్వామి కార్యముల నిర్వర్తింపుచున్నారు. కన్యకాపరమేశ్వరి యాలయమునకు 3,000 రూప్యములు మూలధనమొసంగిరి. తెలుcగు విద్వత్పరిషత్తునకు (Telugu Academy) కి రూ. 1,116ల విరాళమొసంగిరి. శ్రీ కాకినాడపురమున వీరొక వేదపాఠశాలను బ్రతిష్ఠించి యందలి విద్యార్థులకు భోజన మిడి వేదము నేర్పించుచు వేదోద్ధారకు లను యశమును గడింపుచున్నారు.

రావ్‌బహదరు వెంకటాచలపతిగారు గూటాల జమిందారు లయిన మన్యము వారి కుమార్తె సత్తిరాజమ్మగారిని బరిణయమై యామె వలన రామకృష్ణయ్య, సూర్యనారాయణమూర్తి, వెంకటరాజు, సత్యనారాయణమూర్తి, చిన రామకృష్ణయ్యగార్లను నేవురు పుత్రులcగాంచిరి. వీరు ప్రతిభాశాలురై యనేక వ్యాపారములనుగడు సమర్థతతో నిర్వహింపుచున్నారు. వీరికొక రైసుమిల్లు, ఆముద ముదీయ యంత్రములు (Castor oil Mill) గలవు. ఇవి వీరికి లాభ దాయకముగ నుండుటయ గాక పెక్కంద్రు బీదజనులకు జీవనోపాధి గలిగించు చున్నవి.

వీరి జ్యేష్ఠపుత్రులైన రామకృష్ణయ్యగారు చాల పలుకుబడి గలవారై చాలకాలము దనుక హానరరీ బెంచి మేజిస్ట్రేటుగను, లచ్చు రామేశము గారిచే స్థాపితమైన సత్రమునకు విచారణకర్త (Managing Trustee) గను నున్నారు. ఇcక రావ్ బహద్దరు వెంకటాచలపతిగారి యనుజులైన చలమయ్యగారి యొక్కయు వారి కుటుంబము వారి యొక్కయుc జరిత్ర దెలిసికొనవలసి యున్నది. ఈ చలమయ్యగారు–

సీ॥ చలికాలమందున ♦ బలితంపు దుప్పట్లు
లోకవిదావళి కిచ్చెc ♦ గోటికోట్లు
వర్షకాలమునందుc ♦ బట్టుcబుట్టంబుల
విద్వాంసులకు నిచ్చె ♦ వేనవేలు

ఎండకాలమునందు ♦ దండిపండితులకు
ఛత్రపాదుక లిచ్చె ♦ శతశతములు
సేతువునకునుc ♦ గాశికిc బోవువారికిc
బాథేయముల నిచ్చె ♦ బహుశతములు"

గీ॥ హవ్యకవ్యాది కర్మంబు ♦ లాచరించు
కర్మకులకెల్ల వెండియు ♦ గరములిచ్చెc
బుణ్య పైడాన్వయాబోధ ♦ పూర్ణచంద్రుc
డైన చలమయ్యcబోలువా ♦ రవనిc గలరె?"

అని కీర్తి గాంచి.

ఆ.వె.॥ అతcడు సిరులచేత ♦ నవనీతలమునందు
వరలు లింగమల్లు ♦ వారికన్య
సుగుణ ధన్య నిఖిల ♦ సుందరీ జనమాన్య
శేషమాంబc బెండ్లి ♦ చేసికొనియె."

ఈపెయు ధర్మపరాయణయై యనేక పుణ్యతీర్థముల సేవించి కాకినాడ యందును, రామేశ్వరమునందలి రామలింగేశ్వరస్వామివారి సాన్నిధ్యమందును లక్షవత్తుల వ్రతమును సలిపి యవ్వారిగా వివిధ దానములను గావించియున్నారు. ఈ దంపతులకు రామలక్ష్మణులంబోలె శ్రీ రామకృష్ణయ్యగారు, వేంకట నారాయణ గారు నను నిరువురు పుత్రుల జనించిరి. వీరు దమ తాత తండ్రులొనరించిన ప్రజాహిత కార్యముల మది నెంచి వారివలెనె తామును సత్క్రియ లాచరించి పేరొందవలయునను గోర్కిచే నమితోత్సాహముతోc బ్రతి యుద్యమమునకును ముందంజ వేయుచుందురు. ఈ సోదరులిరువురును నన్యోన్య ప్రీత చేతస్కులై, యైకమత్యము గలిగి స్నేహితులంబోలె మెలంగుచు నెక్కార్యము నైనను నుభయులు సంప్రదించుకొని తమ యైకమత్యమునకు భంగము లేకుండc గావింపు చుందురు. తమ జననీ జనకులచే స్థాపింపcబడిన ధర్మకార్యముల కంతరాయము గలుగకుండc బాలింపుచు సహజధర్మశీలురై వీరును బెక్కుధర్మకార్యము లాచరించచున్నారు.

ఈ సోదరద్వయము గణపతి నిష్టదైవముగ భావించి గణపతి నవరాత్రముల సందర్భమునఁ దమ భవనమున గజానన పూజఁ గావింపుచు వివిధాలంకారముల తోను, హరికథాకాలక్షేపములతోను, గానసభలతోడను వేడుకలు సేయుచుఁ దొమ్మిదవ దినమున దివ్యసుందర వాహనములపై మేళతాళములతో నూరేగించి యానాఁడు గొప్ప సంతర్పణమును జేయుదురు.

కాకినాడయందుచిత పఠనాలయము లేకుండుటచేత సర్వజనోపయోగకరముగ నుంనునట్లొక యుచిత పఠనమందిరము (Free Reading Room) ను స్థాపించి, యందులకై వివిధ వార్తాపత్రికలను సంస్కృతాంగ్లేయాంధ్ర హిందీ గ్రంథములను దెప్పించి సమస్త ప్రజలకు నందుబాటుగ నుండునట్లేర్పఱచిరి. దీని పరిపాలనము నకై యొక గుమాస్తాయు నొక బంట్రోతును గలరు. ఇందున కచిరకాలములోనే యొక ప్రత్యేక భవనమును గూడ నెలకొల్పఁబోవు చున్నారు.

ఈ సోదరులు దమ తండ్రిగారివలెనె ప్రతి సంవత్సరమును బీదలకు శీతాకాలమున దుప్పట్లను, వేసవికాలమున పాదరక్షలను, వర్షాకాలమున గొడుగులను విరివిగ దానము సేయుచుందురు. కార్తికమాసమున వారితోట యందుఁ బ్రతివత్సరమును బ్రాహ్మణులకును, వైశ్యులకును వనసంతర్పణమును జేయుదురు. సంవత్సరములో నొకసారి వికలాంగులైన పాటకపు జనమునకు నన్నదాన మొనరింతురు. అంతియెగాక సౌమ్య హృదయులును నుదారశీలురును నై పండితుల నాదరించుటయందును, వివాహాది శుభకర్మలకు సాహాయ్య మొనరించుట యందును, దైవకార్యములకును విరివిగ విరాళమొసంగుచుందురు. విద్యార్థుల నెక్కుడు వాత్సల్యముతోఁ జూచుచుందురు.

దయారసపూరితులగు వీరు దమ రైతులనెడ నెట్టి కాఠిన్యమును జూపక పంటలు పండని కాలమున రైతుల వేడికోలు ననుసరించి శిస్తుదస్తులను వీలైనంత వఱకుఁ దొలగించి రైతుల కృతజ్ఞతకుంబాత్రులగుచుందురు. యువకులైనను బ్రస్తుత నవనాగరికావేశమునఁ జిక్కుకొనక దైవభక్తిగలవారై ద్వాదశీ ధర్మకార్యములకై రెండువేల రూప్యములను మూలధనముగ నుంచిరి. దీని వృద్ధి (వడ్డి)చేఁ బ్రతిద్వాదశియందును, దానధర్మము లొనరించుచున్నారు. సుబ్రహ్మణ్యే

శ్వరస్వామివారి యాలయమునకుఁ గొంత ధనసహాయ మొనరించిరి. మతాభిమానులై హిందూ మతాభివృద్ధి కారువందల (600) రూప్యములొసంగిరి. కాకినాడ కర్మాగారమునకును ధనసాహాయ మొనరించిరి. హిందీ భాషాభిమానులై తత్ప్రచారమున కెక్కుడు ప్రోత్సాహ మొసంగుచున్నారు.

కన్యకాపరమేశ్వరీ దేవళమును గట్టినప్పుడు భూరివిరాళ మొసంగిరి. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వాములవారి యుత్సవ విగ్రహములను గానుకగ సమర్పించి దైవభక్తిని జూపిరి. మహాపురుషులైన దేశనాయకుల చిత్రపటములను దెప్పించి కొన్ని సంస్థలయందు నెలకొల్పి ప్రజలకు దేశారాధనయందు బ్రోత్సాహముఁ గలిగించిరి.

శ్రీమంతులును జమీందారులును నగుటచేతనేగాక యుత్సాహముగల యువకులు నగుటచే వేసంగికాలమున విహరించుటకై యొక సుందరమైన భవనము (Summer Palace) ను నందొక యుద్యానవనమును నిర్మింపించి యందు విలాసార్థముగ విహరింతురు. ఆరోగ్య వారప్రదర్శన సందర్భమున (Health Week) బీదలకుఁదగు చొక్కాలను గుట్టించి యొసంగు చుందురు. ఇటీవలనే వీరి యాశ్రితులైన సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కొక గృహదాన మొనరించిరి.

ఈ సోదరులైన శ్రీరామకృష్ణారావుగారును వేంకట నారాయణరావుగారును నాటక కళయందభిరుచిగలవారై పోటీపరీక్షలను బెట్టి రజతమయ శ్రీరామ విగ్రహమును శ్రీరామసమాజము వారికొసంగియు, నటకులకు సువర్ణపతకము లొసంగియుఁ బ్రోత్సహించుచున్నారు.

మఱియు శ్రీ వేంకటనారాయణగారు స్వస్థానమైన కాకినాడ పట్టణమున మొదటి తరగతి గౌరవదండనాధికారి (1st Class Honorary Magistrate) గ నియమింపఁబడిరి. వీరీపదవి కెంతయు నర్హులని వేఱ నుడువఁబనిలేదు. ఆగర్భ శ్రీమంతులయ్యును వీరు నిరంతరమును బ్రజాహిత కార్యతత్పరులై యశస్సంపాదనమునకుఁ దదేకదీక్షతోఁ బాటుపడుచుందురు.

తమ తండ్రిగారైన పైడా చలమయ్యగారి పేరట వారి భవన సమీపమున నెలకొల్పఁబడిన సత్రమును నీ సోదరులు సముచిత భంగిఁ బాలించుచు నెట్టి

కొఱంతయు లేకుండ నభివృద్ధి పఱచి విద్యార్థులకు దాత్కాలికముగఁగాకుండ వారి విద్యార్థి దశ గడచునంతదనుక భోజన మొసంగుచున్నారు. విద్యార్థులకే గాకుండ యాత్రికులకును బాటసారులకును నుచితభోజనాది సౌకర్యము లొనఁ గూర్చుచుందురు. బాటసారులకును నుచిత భోజనాది సౌకర్యము లొనఁగూర్చు చుందురు. ఇట్లే ఈ సోదరులిరువురు ననేక ధర్మకార్యము లొనరించుచు దీనదయా పరులై కీర్తికాము లగుచున్నారు.

మఱియుఁగొన్ని లక్షలరూప్యముల వ్యయముతో రాజమహేంద్రవరము నందు స్థాపింపఁబడిన కాగితములను జేయు యంత్రాలయము (Carpatic Paper Mills) ధనాభావము చేతను, తదితర కారణముల చేతను నన్యాక్రాంతము సేయఁబడ నున్న తరుణమున శ్రీయుత పైడా సోదరులయు శ్రీయుత రామకృష్ణారావు గారును వేంకట నారాయణరావు గారును శ్రీయుత మోతే నారాయణరావుగారును సంప్రదించికొని "యాంధ్రు లొక్క కర్మాగారమును నిర్వహించు కొనఁజాలరై" రను దుర్యశంబు వాటిల్లకుండునట్లు నాల్గు లక్షల రూప్యములకు మించిన పెట్టుబడితోఁ దాము నిర్వహింపఁబూనుకొని తగు భాగస్వాముల నేర్పఱచు కొనుచు కార్యభారమును వహించిరి. ఇందువలన దేశీయ కార్మిక సోదరుల కెంతయో జీనోపాధి యేర్పడెను. ఈ సందర్భమున శ్రీ పైడా సోదరులు ప్రబలకృషి యొనరించి యాంధ్రదేశగౌరవమును నిలువఁబెట్టిరి.

ఇట్టి శ్రీయుతులు పైడా రామకృష్ణారావుగారును వీరి యనుజులైన వేంకట నారాయణరావు గారును దమ పితృపితామహులంబోలె నుదారశీలురై, ధర్మకార్య పరతంత్రులై, దేశక్షేమంకరులై వర్ధిల్ల నాయురారోగ్యంబుల గూర్చి శ్రీజగన్నాయకుడు, నిరంతరమును సంరక్షించుఁగాక.

**క॥** వనధిగభీరులు కవిజన
వినుతులు శ్రీరామకృష్ణ ♦ వేంకటనారా
యణసోదర లురు సాదర
గుణమేదురు లలరు చంద్రు ♦ గోవిందుకృపన్॥

**సీ॥** వరశీల శేషమాం ♦ బాగర్భశుక్తి ము

క్తాఫలంబు లనంగఁ ♦ దనరి రెవరు?

తలిదండ్రులట్ల ని ♦ ర్మల కీర్తి బెంప స

త్క్రియ లజస్రము నాచ ♦ రింతు రెవరు?

అఖిలార్థ్వగాళికిఁ ♦ నన్నప్రదానంబుఁ

బ్రీతి నెల్లపుఁ డొన ♦ రింతు రెవరు?

సాదరమతిఁ బేద ♦ సాదలఁ గని తగు

సాహాయ్య మొనరించు ♦ సరసు లెవరు?

**తే॥గీ॥** రమ్యయశు లెవ్వ రట్టి శ్రీ ♦ రామకృష్ణ
యాఖ్య వేంకటనారాయ ♦ ణాభిధేయు
లాయు రున్నతిఁ బుత్ర పౌ ♦ త్రాభివృద్ధిఁ
దనరుదురు గాక యాచంద్ర ♦ తారకంబు.

**(Added by Pydah Family Members)**



(1904 -1984)

**Pydah Sreeramakrishnayya** garu

Donor for Pyndah Chalamayya St. Xaviers Convent School

Constructed "Pyndah Srinivasa Chalamayya Kalayana Mandapam" – the first wedding/convention hall (suited also for middle income families) in Kakinada

Strong Spiritualist that organized several lectures by world renowned philosophers and Vedantic gurus.

**(Added by Pydah Family Members)**



(1907 -1979)

## **Pydah Venkata Narayana** garu

Freedom fighter with close ties to Mahatma Gandhi, Nehru, Prakasam Pantulu, Potti Sriramulu and Bulusu Sambamurthy. They stayed at the family house.

Was Chairman of Kakinada Municipality, MLA of composite Madras State, MP in the first Rajya Sabha & MLC in AP Legislative Council

As a member of Rajya Sabha brought the first non-official resolution for a separate Andhra State.